# ఆషాడభూతి రసానుభూతి

ఆఫీసరు గురించి ముందు నెమ్మదిగానైనా చెప్పడానికి వీల్లేని విమర్శలు వెనక వీలయినంత గట్టిగా స్నేహితులతో చెప్పిచెప్పి ప్రాణం విసుగెత్తి, ఆకలి ఎలుగెత్తి తొమ్మిదిన్నరకి ఇంటికి చేరుకున్నాడు వెంకటేశం. టీచరు క్లాసు రూంలోకిరాగానే ఒక్కసారి అల్లరంతా ఆగి పోయినట్టు వెంకటేశం గుమ్మంలో కాలుపెట్టగానే అంతకు ముందునుంచే ఆకాశంఎత్తుగా అంటుకున్న కొంప కాస్సేపు ఆరింది. 'వంకాయ ముక్కలే తిందామా, వంకాయలే తినేద్దామా, వంగతోటే చప్పరిద్దామా' అన్నంత ఆకలితో ప్రవేశించిన వెంకటేశం వేడి కాఫీలాంటి ఆశ 'భోజనమే మానేద్దామా, నీళ్ళు పోసుకోడం రేపటికి వాయిదా వేద్దామా, ఆఫీసుకి శలవుచీటీ పంపేద్దామా' అన్నంత చప్పగా చల్లారి పోయింది. దానికి కారణం వంటింట్లో పొయ్యిరాజేసిన లక్షణాలయినా లేకపోవడమే.

'మరణశిక్ష కంటె పెద్దశిక్ష ఏది ?' అని ఆ క్షణంలో వెంకటేశాన్ని ఎవరయినా అడుగుతే 'అసిరమ్మలాంటి అమ్మ, కొరివిదెయ్యంలాంటి కొమ్మ – ఈమధ్య జీవించమనడమే !' అని ఠక్కున చెప్పిఉండే వాడు.

'అమ్మా ! ఆకలే !' అన్నాడు వెంకటేశం తల్లితో బాలుడై.

'పూర్వకాలందాన్నీ, బుద్ధిలేనిదాన్నీ నా వంటలేం నచ్చుతాయి నీకు కొడకా ? నిన్ను చిన్నప్పట్నుంచి కని పెంచి యింతవాణ్ణి చేసి నీ ముచ్చట్లూ నీ మురిపాలూతీర్చే బయస్కోపుబొమ్మ ఉందిగా ! వెళ్ళి దాన్ని అడుగూ–ఏమిటో నా వెట్టి ! అడ్డాలనాడు బిడ్డలుగాని గెడ్డాలు నాడు బిడ్డలా ?' అంది సుబ్బమ్మ కొడుకుతో కాళియై.

'ఇవాళ యింట్లో వంటలులేవా ఏమిటి ?' అన్నాడు వెంకటేశం భార్యతో చిరుకోపంతో.

'ఏమో నాకేంతెలుసూ, ఇంట్లో నా పెత్తనమేముందీ? నిన్నా మొన్నా వచ్చిందాన్ని నాకేంతెలుసూ? బ్రహ్మచర్యదోషం సంక్రమించకుండానూ, వంటమనిషికి జీతం ఖర్చుకాకుండానూ గతిలేక, మళ్ళీ చెప్పాలంటే మతిలేక—నన్ను కట్టుకున్నారు గాని నేను మీ కట్టుబాట్లుగాని, అలవాట్లుగాని ఏ మెరుగుదునూ? అన్నీ తెలిసిన అపురూపం అమ్మ ఉందిగా! వెళ్ళి అడగండి. భార్య విషమాయె తల్లియే బెల్లమాయె అంటారు ఇదే కాబోలు'' అంది అమ్మడు భర్తతో బహుశోకంతో.

చిరపుంజిలాంటి ప్రదేశంలో నివసిస్తున్న వెంకటేశం వర్షం కురిస్తే ఆశ్చర్యపడవలసిన అవసరంలేదు. కాని ఈ సరికొత్త పెను తుఫాను మితి తెలిపే భారమితి ఎక్కడా అని అతని ఆకలిగొన్న మనస్సు ఆరా తీసింది! ఆ భారమితి పక్కింటి పనిలేని సుమంగలి.

ఏడున్నర అవుతుందిట, అగ్గిపెట్టి తెప్పిద్దామని అమ్మడు ఆయనగారి సొరుగు తీసిందిట. అందులోని ఆరు కొత్త రవికల గుడ్డలు చూడగానే ఆమె మనస్సే అగ్గిపెట్టి అయిపోయింది. అగ్గిపుల్లలన్నీ ఆలోచనలు బయలుదేరేయి. "నరుని నమ్మేకన్న నాగుని నమ్మడం మంచిదన్నారు. ఆర్నెల్లనుంచి చెబుతున్నా జాకెట్లు చిరిగిపోయాయి, రెండే రెండు గుడ్డలు తెప్పించి పెట్టండీ అని. దానికేమో డబ్బు లేదుటా, 'ఊరు పొమ్మంటూందీ కాడు రమ్మంటూంది' అనే వయసున్న అమ్మకి తేవడానికి కావలసిన డబ్బుంది. సిగ్గు లేకపోతే సరీ—ఎవరికీ? ఎవరికీ ఏమిటి? నాకే!'' అనుకుంటూంటే కళ్ళమ్మట నీళ్ళొచ్చాయి. ఆ చింత పత్రాక్షికి. అంతే ఆవిడ అవతలి గదిలో పక్క దిగలేదు. 'ఏడవడానికైనా శక్తి ఉండొద్దా?' అని నిన్నటి మిసపరొట్టి ఉంటేనూ అది ఊరికే పోకుండా ఖాళీచేసి ఇన్ని మంచినీళ్ళు తాగి కటికి ఉపవాసం చేసిందిట ఆ నోరెరగని సుకుమారి.

మరో అరగంటకి రాచ్చిప్పలు అమ్మకానికి వచ్చాయిట ఆ వీధికి. సుబ్బమ్మ చెవినిపడకుండా ఆ వీధికేక అంతరించడం అసాధ్యం కదా. భుజంమీద రవికచిరుగు కనపడకుండా కొంగుకప్పుకుని ఆ రాచ్చిప్ప లబ్బిని కేకేసింది ఆవిడ మడి మెంతికాయకి ఏదీ జాగాలేదనే సదుద్దేశంతో. 'ఆ మాత్రం స్వతంత్రంలేదా?' అనుకుని డబ్బుకోసం కొడుకు సొరుగు తీసిందట. అందులోని రవికలగుడ్డలు చూడగానే ఆమె నోరే రాచ్చిప్ప అయిపోయింది. అందులోని మెంతికాయ రకరకాల ఊటలూరింది. 'చి ఛీ—కొత్తకోడల్ని నమ్మేకంటె పాతకోడల్ని నమ్మడం మంచిది. ఇంతకీ మనవాడు తనవాడు కాకపోయింతర్వాత పరాయిది సజావుది ఎలా అవుతుంది? శీతాకాలం—చిరుగు రవికలతో—అతుకు బొంతలతో అఘో రిస్తున్నాను. అన్నీ దాని ఒళ్ళోనే పొయ్యకపోతే 'అమ్మా ఇదిగో' అని ఒక్కటి—ఒక్కటంటే ఒక్కటే సుమీ—ఇస్తేతప్పా?' అనిపించి ఆవిడ మనసు బాధించి—ఆకలి వేధించి—అరవీసె గోధుమపిండీ, పావుశేరు— పంచదారా, అర్ధపావు నెయ్యీ ఇంట్లో లేదనిపించింది. పెరటి వసారాలో గుమ్మంమీద చెయ్యీ, చెయ్యిమీద బుఱ్ఱా పెట్టుకుని ప్రాయోపవేశంచేసింది ఆ అమాకురాలు.

ఆ విధంగా అలిగి పడుకున్నవారై ఆ లక్ష్మీ సరస్వతులు 'తిన్నది అరక్క' ఒకళ్ళనొకరు అడిపోసుకున్నారని గిట్టనివాళ్ళు చెబుతారు.

'అయితే అత్తగారూ నాకు తెలియకడుగుతానూ, పోనీ నాకు ఏమీ వద్దనుకోండీ...ఇదుగో ఇలా మా అబ్బాయి తెచ్చాడు అని నాకు చూపిస్తే తప్పటండీ?' అని అగ్గిపుల్ల వెలిగించింది పక్కగదిలోని సన్నాయి నొక్కుల చిన్నారి టక్కరి.

'అనమ్మా ... అను ... ఇంకా బతికి ఉన్నాను కదూ' నువ్వూ నీ మొగుడూ కుక్కను కొట్టినట్టు కొట్టండి...ఏముందే? జరుగుతూంటే

సరీ...అడ్డుబడి అడిగేవాడులేక ... చెప్పుచ్చుకుని చెప్పేవాడులేక ... చిదగ్గొట్టి జీడిపోసేవాడులేక ... అవునే కోడలుపిల్లా ... రవికల గుడ్డ లేమో దక్కించుకున్నావ్...'మొగుణ్ణి కొట్టి మొగసాల ఎక్కిందని...' అంటూ అరకాయ కిరసనాయిలు పోసింది ఇవతలి గదిలోని కారాల మిరియాల గయ్యాళిగంప.

ఈ మంటలు చూసి ఇరుగు పొరుగు అగ్ని 'వ్యాపక' దళం వచ్చి పడింది. అత్తా కోడలూ ఎక్కడ కలిసిపోతారో అనే సద్భావంలో, వీళ్లై నంత తొందరగా అన్నిరకాల కర్ర (విరుపు మాట)లూ అందిచ్చారు. తిరిగి వెంకటేశం ప్రవేశించినప్పుడు మాత్రమే తాత్కాలికంగా ఆ కొంప ఆరింది. సంగతి విన్న కథానాయకుడి మనస్సు విరగబడి నవ్వింది.

"ఏం మనుషులర్రా మీరు! గంటసేపు ఇంట్లోలేకపోతే కొట్టుకు చచ్చారా? ఇంతకీ ఆ రవికల గుడ్డలు మా ఆఫీసరు పెళ్లానివి. పొద్దుటే అలా వస్తూంటే వాళ్ళ గుమాస్తా కనబడి 'బాబూ, మరోలా అనుకోక– మీ యింటిపక్క మా ఆఫీసరుగారింట్లో బట్టలుకుట్టే టైలరు సూర్యారావు ఉన్నాడు, అతని కిచ్చేద్దురూ. ముసలాడిని మళ్ళీ అంతదూరం రాలేను' అని ఇచ్చాడు. పైన ఒదిలేస్తే పోతాయని డ్రాయర్లో పెట్టి తాళం వేశాను. ఒచ్చి ఇవ్వొచ్చుగదా అని అలా వెళ్ళేను. ఇంతలో ఇల్లు అంటించేశారా? నిజంగా బతికుండగా మ్యూజియంలో పెట్టవలసిన మనుషులు మీరు!"

వెంకటేశం మళ్ళీ నవ్వేడు. ఈసారి సరిగా నవ్వలేకపోయాడు. ప్రసాదం లేని భక్తీ, భుక్తిలేని ముక్తి ఇలాంటి వాటిమీద నమ్మకం లేని సామాన్య మానవుడతను. దేహదారుఢ్యం తరవాతే ఆత్మసౌందర్యం అనే లెక్కల్లో మనిషతను. అరగంట కాలమూ, అయ్యారికి పన్నెండణాల డబ్బులూ ఖర్చుపెడితేగాని అతని ఆలోచనలు మళ్ళీ అందుకోలేదు. ఆఫీసుకి సెలవుచీటి పంపి అరువు బీడీ ఒకటి వెలిగిస్తేగాని అతని మనసు కుదటపడలేదు.

ఈ యిద్దర్లో ఎవరి నొదిలించుకునే సావకాశమూ లేదు అతనికి. ఇంత చిన్న విషయానికి అంతలా దెబ్బలాడుకున్న వీళ్ళతో బతికి భరించి బట్ట కట్టే సావకాశమూ కనిపించడంలేదు. ఓ వేమన రాసినట్టు 'తప్పించుకు' తిరుగుదామంటే – దాం దుంపతెగ ముద్దేనా పెట్టరాయె! ఎనభై నాలుగు రూపాయిల జీతంతో ఎన్నాళ్ళు యిక్కడా అక్కడా తినడం? తను కాబట్టి కాని, యింకోడైతే ఈపాటికి జంధ్యాలు తెంపుకుని పారిపోడూ? అన్నట్టు ఆ అవకాశమూ తనకి లేదు. మెళ్ళో జంధ్యాలు లేవు! 'భిక్ష' తరువాత అవి ఏ కుక్క మెళ్ళోనో వేసేసినట్టు జ్ఞాపకం! దీనికేదో చెయ్యాలి, ఇలా ఊరుకుంటే లాభంలేదు. ఆ రోజునుంచీ శ్రద్ధగా పాఠం చెప్పడం ప్రారంభించాడు.

'ఇలా చూడు అమ్మడూ, నే చెప్పింది జాగ్రత్తగా విను. నువ్వు అమ్మ గురించి చెప్పేవన్నీ రైటే. నిజంగా నువ్వు చెప్పినట్టు ఆవిడతో నెగ్గుకు రావడం కష్టమే...పనికి మాలిన పట్టుదలలూ, అర్థంలేని ఆచారాలూ మన కుటుంబాలలో యింకా మాంచి పునాది దిట్టంలో ఉన్నాయి. చూసీ చూడ నట్టు ఊరుకోడమేగాని మనం ఏమీ చెయ్యలేం. ఇంకా ఈ రోజుకి కూడా ఒకే నూతిలోంచి బ్రాహ్మణుడు తోడితే బ్రాహ్మణ నీళ్ళు అనీ, కాపుది తోడితే కాపునీళ్ళు అనీ అనే వాళ్ళను మనం ఏం చెయ్యగలం? ఆవిడ నీకంటె ముప్ఫై ఏళ్ళు పెద్దది. అంటే ఆవిడలో పాతుకుపోయిన, ఆవిడ నమ్మిన భావాలకు నీకంటె ముప్ఫై ఏళ్ళు ఎక్కువ వయస్సు ఉందన్నమాట. నాకు నచ్చిన విషయాలు కొన్ని నీకు నచ్చవు. అయినా భరిస్తున్నావా లేదా? స్త్రీలకు మొగుడే దేవుడు అయినపుడు మొగుణ్ణి కన్నతల్లి దేవుడి తల్లితో సమానం కదా! ఆ తల్లి భావాలు భరించవలసిన, గౌరవించవలసిన అవసరం నీకు లేదా? పోనీ ఆవిడమాట ఒదిలెయ్యి. నా సుఖం నీ కక్కర్లేదా? నన్ను కన్నతల్లి సుఖంగా లేకపోతే నేను సుఖంగా

ఉండగలనా ? అలా అయినా నువ్వు ఆవిడ లోపాల్ని మన్నించి ఆవిడ మంచిని గుర్తించవద్దా ? ఇంట్లో ఉన్నవారు ఇద్దరు. మీ రిద్దరూ ఒకరి కొకరు సాయంగా ఉంటే మీకెంత సులువు ? నాకెంత సుఖం !'

అమ్మడు ఈ మాటలకు కొన్నాళ్లు కోపంగా చూసేది. కొన్నాళ్ళు మాటడేది కాదు. తరవాత నవ్వేసేది. వెంకటేశానికి ఏనుగంత బలం వచ్చింది. అతడు ఈ నీతి పాఠాలు అమ్మదగ్గరకూడా మానలేదు.

'చూడమ్మా, పెద్దదానివీ, అన్నీ తెలిసున్న దానివీ నీకు నేను చెప్ప వలసినవాణ్ణి కాను. అయినా ఉండబట్టలేక చెబుతున్నందుకు క్షమించు. ఇంతకీ నేను చెప్పేది నా పెళ్ళాన్ని గురించి. దానికి కాస్త సోమరితనం, మరి కాస్త మాటకారి తనం ఉన్నమాట నిజమే. కాని అది చిన్నది. దాని కింకా పాతిక నిండలేదు. దాన్ని నీ కాలంతో పోల్చి నువ్వు అసంతృప్తి పడడం న్యాయం కాదు. మీ కాలంలో మొగాడు వస్తే తలుపు చాటునుంచి మాటాడేవారు. ఈ కాలంలో ఆడది గబుక్కునివస్తే మగాడే కొంచెం జంకుతున్నమాట మాత్రం నిజం. రోజులు మారాయి అని నీకు తెలుసు కనక నువ్వు మారడం మంచిది. మారకపోతే మారినవాళ్ళని సాధించడం మాత్రం మంచిది కాదు. అప్పటికీ ఇప్పటికీ వంటలో, అలంకరణలో గృహనిర్వహణలో అన్ని పద్ధతులూ మారేయి. ఇది చెడుకే అని మీ పూర్వ కాలపువాళ్ళ అభిప్రాయం. కాదు మంచికే అని మా అభిప్రాయం. కావొచ్చు. ఒకళ్ళ అభిప్రాయాన్నొకరు గౌరవిద్దాం.మంచి అనితోస్తే అనుకరిద్దాం.అంతే గాని మూఢ విశ్వాసాలూ మూర్ఖపు పట్టుదలలూ ఒకరిపై రుద్దడం ఎందుకు? మునుపు జాకెట్టుచెయ్యి భుజంవరకు ఉండేది. ఇప్పుడు సినిమాలో లక్ష్మీదేవి కూడా మోచెయ్యివరకు జాకెట్టు తొడుగుతోంది. దానికేమిటి ? సరిగా బోధించి తప్పయితే ఒప్పించి, నీ కోడల్ని నీ వైపు తిప్పుకోవాలి— ఏమైనా లోపాలుంటే నా మొహం చూసి మన్నించాలి. అంతేగాని మీ

రిద్దరూ 'కంయ్' అంటే 'కంయ్' అంటే ఇద్దరికీ కావల్సిన మధ్యనున్న మొగాడు ఏమైపోవాలి ? చచ్చినట్లు రోజల్లా ఆఫీసులో చాకిరీ చేసి విశ్రాంతి కోసం ఇంటికొచ్చే మొగాడికి ఇదేనా మీ ఆడాళ్ళిచ్చే శాంతి ? అమ్మా... ఒకటే నే చెప్పేది...మీ రిద్దరూ ఏకమాట అనుకుని...కలిసికట్టుగా ఉండే రోజు కోసం చూస్తున్నాను. అలాంటి రోజు వస్తుందా ?'

సుబ్బమ్మ వినకుండా లేచిపోయినా తర్వాత శ్రద్ధగా వినడం అతనికి కొంత ధైర్యాన్ని యిచ్చింది.

తను చేసిన ప్రయత్నం కొంచెం కొంచెం ఫలించడం వెంకటేశానికి సంతోషం కలుగజేసింది. మరి ఇద్దరూ ఏం కూడబలుక్కున్నారో తనతో ఒకటి రెండు మాటలకన్న మాట్టాడ్డమే లేదు. అంతకన్న తనకి కావలసింది ఏమిటి ?

'అర్ధరూపాయి పెట్టి చామంతిపువ్వులు కొన్నావా? ఎవరేనా నవ్వుతారు?' అని తను అనబోతూవుంటే అమ్మ అడ్డువచ్చి,

'బాగుందిరా...చిన్నపిల్ల...యిప్పుడు కాకపోతే ఇంకెప్పుడు సరదా వుంటుంది !' అనడంకంటె తనకి కావలసింది ఏముంది !

'ఇంత చలిలో నువ్వు నూతి దగ్గర స్నానమా ?' అని అమ్మతో దెబ్బలాడుతుంటే 'మీరు ఊరుకోండి. ఆవిడ పిచ్చేదో ఆవిడకి ఆనందం. మీకేం అడ్డొచ్చారు గనుకనా ?' అని అమ్మడు అనడంకంటే తను కోరేది ఏముంది ! నిజానికి ఇంతకంటె తాను ఆశించే రసానుభూతి ఏముంది ? కన్నతల్లీ కట్టుకొన్న లిల్లీ పిళ్ళిద్దరి ఐకమత్యంకంటె మధ్యనున్న మొగాడికి ఆనందానుభూతి ఏముంటుంది ?

'చూడండీ, ఈ నెలజీతం తెచ్చి నా కియ్యండి' అంది ముప్ఫైయ్యో తారీకున అమ్మడు.

'ఎందుకూ ?' అని అడిగాడు వెంకటేశం.

'ఎందుకు ఏమిట్రా వెర్రికుంక! 'ఇంటికి ఇల్లాలు ఇండియాకు జవహర్లాలు' లాంటిది. మొగాడివి ఇంటికి యేది కావాలో, యేది అక్కర్లేదో నీకేం తెలుసు, వంకాయ్ పులుసు? మేమిద్దరం ఆలోచించి అంతా ముందే పద్దువేశాం. తీసుకొచ్చి దానిచేతుల్లో పొయ్యి-మాటాడకు.'

వెర్రి సంతోషంతో వెంకటేశం కిళ్ళీకయినా అర్ధణా మిగుల్చుకోకుండా, ఎనభై నాలుగూ ఒకటోతారీకు సాయంకాలమే అర్ధాంగికి అప్పచెప్పేశాడు. ఎటువంటి బాధా, బాధ్యతాలేకుండా తను హాయిగా గడపొచ్చు. పెద్దలు కట్టిపారేసిన యిల్లుంది. అద్దెబాధలేదు. తాము ముగ్గురు మనుషులు, యెనభై రూపాయలు చాలవా యేం?

రెండో తారీకు పొద్దున్న ఐదుగంటలకి కాఫీ హోటలుకి వెళ్ళినప్పుడు అయ్యరు జ్ఞాపకం చేశాడు, రెండు నెలలకాతా సుమారు పదహారు రూపాయిలు ఇవ్వాలని. దాన్తో అతనికి తక్కిన అన్ని బాకీలూ జ్ఞాపకం వచ్చాయి. వెనుక రాబడిలేక వెనుకబడిన మధ్యతరగతి సంసారికి కాతా లేనిదే 'జిందగీ కైసే జాతా?' బీడీ షాపులో నాలుగున్నర ఇవ్వాలి. బియ్యంకొట్లో ఏభై చిల్లర...బట్టలకొట్లో ముప్పైదాకా ఇవ్వాలి. ఈ అప్పులు తీర్చడానికి తన ఒక నెల జీతమే చాలదే! అన్నట్టు మందులషాపులో యిరవైనాలుగు ఇవ్వాలి. కానియ్యి. అన్నీ ఒకసారి ఎవరూ తీర్చలేరు. సగం సగం తీరుస్తే సరీ...అన్నీ ఎలా ఉన్నా ఇంట్లో ఈనాటికి తన తెలివితేటలవల్ల, తన నీతి పాఠాలవల్ల కట్టుబంటూ ఒకటి ఏర్పడింది. ఇక ఏ అప్పుబాధా తనని బాధించలేదు...తన అమ్మా తన భార్యా ఒకటి. అంతకన్న మధురానుభూతి ఏముంది? నైట్‌క్వీన్‌లాంటి... ఐస్‌క్రీమ్‌లాంటి...ఆలోచనతో వెంకటేశం తొమ్మిదిన్నరకి కర కరలాడే కడుపుతో యిల్లు చేరుకున్నాడు.

ఇవతలిగదిలో మంచంమీద అమ్మడూ, అవతల వసారాలో గుమ్మం తలగడగా చేసుకుని సుబ్బమ్మా పడుకొని కబుర్లు చెప్పుకుంటున్నారు.

'అన్నంపెట్టు ఆఫీసు వేళయిపోతోంది' అన్నాడు వెంకటేశం.

'కూర్చోండి. మీతో మాటాడాలి' అంది అమ్మడు.

'అలా చూస్తావేంరా 'ఆకుమడత' లాగ? కూర్చో...చెబుతూంటే వినపడ్డంలేదా ఏమిటి?' అంది అమ్మ.

'అవతల ఆఫీసుకు వేళయిపోతోందంటే.'

'...అంతకంటె ముఖ్యమైన కబురంటే...ముసిలావిడ మాట మీకు లెక్కలేదా ఏమిటీ?...'

ఆకలిగొన్న వెంకటేశం కుర్చీలో కూలబడ్డాడు.

'మరేంలేదండీ, మీ జీతం లెక్కమాట. ఇంతా చేస్తే ఎంత గనక? నాలుగుమాట్లు లెక్కపెట్టినా ఎనభై నాలుగే. పొద్దుటే మే మిద్దరం బజారు కెళ్ళేము' అని ఆరంభించింది అమ్మడు.

'కాలంతోపాటు మనుషులూ మారాలని నువ్వు అన్నావుగదా... నాయనా నిన్ను నొప్పించడ మెందుకని ఎప్పుడూ గుమ్మమైనా కదలని దాన్ని నేనూ సరాసరి బజారుకి వెళ్ళిపోయాను' అని అందుకుంది అమ్మ.

'చెప్పేదేమిటంటే ఇంట్లో మామూలుగా పనిచేసేటప్పుడు లేవని నేను రెండు పెడన చీరలు పుచ్చుకున్నాను. అత్తగారు రెండు కట్టుడు పంచెలూ, రెండు పొత్తు చీరలూ పుచ్చుకున్నారు. రవికల గుడ్డలతోపాటు ఏభై నాలుగురూపాయలు అయ్యాయి. ఏం అలా చూస్తారేం, చవకే గదూ?'

'ఆఁఆఁ చాలా చవక...తక్కిన ముప్పై?'

'అదేం నీలా బీడీలకీ, కిళ్ళీలకీ తగలెట్టలేదురా బాబూ. మళ్ళీ మళ్ళీ అవదని మంచి దుప్పట్లు కనబడితేనూ, అయిదు రూపాయలిచ్చి చెరోటీ పుచ్చుకున్నాం.'

'మిగిలిన పాతిక?'

'వినండి మరి...అంత తొందరెందుకు ? అదే ముఖ్యమైంది...'

'ఏమంటారో అత్తయ్యా !'

'చెప్పవే అంత భయమెందుకూ ? మనమేం అసందర్భపు ఖర్చు పెడితేగదా ? చెప్పమ్మా...నే ఉన్నాగా...'

'అబ్బ...నేను చెప్పలేను బాబూ...'

'వెర్రిపిల్ల ! ఏమో అనుకున్నాను ఎలా బతుకుతుందో...ఏమీ లేదురా దానివంట్లో ఈమధ్య అతి నీర్సంగా ఉంటోంది...నా మటుకు నేను ముసలిదాన్ని అయిపోయానా. ఏం వండగలను చెప్పు ? నా ఆచారానికి అరవై ఏళ్ళ వయస్సున్నా నువ్వు చెప్పగానే ... నిన్ను నొప్పించడమెందుకని అన్నీ మానేశాను నాయనా ! మరేం లేదు - ఇవాళనుంచి హోటల్‌నుంచే భోజనం ఏర్పాటుచేశాం...ఇరవై అయిదూ ఎడ్వాన్సు ఇచ్చి వచ్చాం...ఇక మాకేం పనిఉంటుంది ? నువ్వు చెప్పినట్టు కలిసి కట్టుగా కబుర్లు చెప్పుకుంటూ ఉంటాం. సరేనా ?'

వెంకటేశం జంధ్యంకోసం పక్కింటి శాస్త్రులుగారింటికి పరుగెత్తేడు. అది లేకపోతే భవబంధాలు తెంపుకుని ఏ సన్యాసుల్లోనో కలిసిపోడం ఎలాగ ?